# ఫ్రీగా బస్సు ప్రయాణం

- అట్టహాసంగా ఉమ్మడి జిల్లాలో మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ పథకాలు ప్రారంభం
- హాజరైన కలెక్టర్లు, అధికారులు
- మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ సౌకర్యం
- పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మాత్రమే అనుమతి




నిజామాబాద్‌లో జెండా ఊపి ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

ఖలీల్‌వాడి/కామారెడ్డి, డిసెంబర్ 9: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యానికి నిర్దేశించిన మహాలక్ష్మి పథకం, ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచే మరో పథకాన్ని జిల్లా స్థాయిలో శనివారం ప్రారంభించారు. నిజామాబాద్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డిలో కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ ప్రారంభించారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన వద్ద రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు పథకాన్ని ప్రారంభించిన అనంతరం మహాలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టారు. మహిళలకు ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తూ ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుకు కలెక్టర్ పచ్చజెండా ఊపి పథకాన్ని ప్రారంభించారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులతో కలిసి జీజీహెచ్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కలెక్టర్ బస్సులో ప్రయాణం చేశారు. బస్సులోని మహిళలకు ఎలాంటి చార్జీలు లేకుండా జీరో ఫేర్‌తో కూడిన మహాలక్ష్మి టికెట్లను కలెక్టర్ స్వయంగా ప్రయాణికులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత రవాణా వసతిని అందుబాటులోకి తేవడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అర్హులైన ప్రతి కుటుంబానికీ పరిమితి పెంపుతో కూడిన రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని వర్తింపజేసేలా పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి వచ్చిందన్నారు. వయస్సుతో నిమిత్తం లేకుండా మహిళలు, బాలికలు, యువతులు రాష్ట్ర వ్యాప్తంగా ఉచితంగా ప్రయాణం చేయవచ్చని, ట్రాన్స్‌జెండర్లకు కూడా ఉచిత రవాణా వసతి వర్తిస్తుందన్నారు. ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్, ఎలక్షన్ ఐడీ వంటి ఏదైనా గుర్తింపు కార్డును చూపించి, ఉచిత ప్రయాణ సదుపాయాన్ని పొందవచ్చని సూచించారు. కార్యక్రమాల్లో ఆర్టీసీ ఆర్‌ఎం జాన్‌రెడ్డి, డీఎంహెచ్‌వో సుదర్శనం, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్, నాయకులు మానాల మోహన్‌రెడ్డి, తాహెర్‌బిన్ హందాన్, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

**కామారెడ్డి జిల్లాలో రూ.15 లక్షల భారం**

కామారెడ్డి డిపో పరిధిలో 12 వేల మంది, బాన్సువాడ నుంచి 5 వేల మంది మహిళలు సుమారు 17 వేల మందికి పైగా బస్సులో ప్రతిరోజు ప్రయాణం చేస్తారు. ఉచిత ప్రయాణంతో ప్రభుత్వం పై రూ.15 లక్షల వరకు భారం పడనున్నది.

**ప్రయాణికుల ఎదురుచూపులు..**

మహాలక్ష్మి పథకాన్ని మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభించనున్నట్లు ప్రకటించడంతో కామారెడ్డి బస్టాండ్ డిపో వద్ద మహిళలు గంట ముందు నుంచి ఎదురుచూశారు. అధికారులు ఆలస్యంగా రావడంతో ప్రయాణికులు అసహనానికి గురయ్యారు. దీంతో డిపో మేనేజర్ అధికారులు వచ్చినప్పుడు బస్సులో పంపిస్తామని చెప్పడంతో ప్రయాణికులు తప్పదన్నట్లుగా కూర్చొన్నారు. కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించడంతో బస్సులో ఎక్కారు. కండక్టర్ వారికి జీరో టికెట్ ఇచ్చారు.



కామారెడ్డిలో జెండా ఊపి ఆర్టీసీ బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ

## పేదలకు ఉచిత కార్పొరేట్ వైద్యం

**ఉమ్మడి జిల్లాలో రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించిన కలెక్టర్లు**



ఆరోగ్యశ్రీ కౌంటర్‌ను ప్రారంభిస్తున్న నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

కామారెడ్డి/ ఖలీల్‌వాడి, డిసెంబర్ 9 : పేదలందరికీ ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచిందని నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్లు రాజీవ్‌గాంధీ హన్మంతు, జితేశ్ వీ పాటిల్ తెలిపారు. నిజామాబాద్ జిల్లా దవాఖానలో రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డి ప్రభుత్వ దవాఖానలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని శనివారం ప్రారంభించారు.



కామారెడ్డిలో ఆరోగ్యశ్రీ పథకం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## కామారెడ్డి కోర్టులో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్ ప్రారంభం



హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణకు మొక్కను అందిస్తున్న జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి

కామారెడ్డి, డిసెంబర్ 9 : కామారెడ్డి కోర్టులో ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను హైకోర్టు జడ్జి లక్ష్మీనారాయణ శనివారం ప్రారంభించారు. అనంతరం కోర్టులో పెండింగ్ కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మరో కొత్త కోర్టు మంజూరు అయినందున ఏర్పాటు కోసం గదులను పరిశీలించారు. అంతకుముందు పట్టణంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయనను జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి, కలెక్టర్ జితేశ్ వీ పాటిల్, ఎస్పీ సింధూశర్మ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

# కొంగొత్తగా..

- కొలువుదీరిన తెలంగాణ అసెంబ్లీ
- ప్రమాణస్వీకారం చేసిన ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు







ప్రమాణస్వీకారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు భూపతిరెడ్డి, తోట లక్ష్మీకాంతరావు, మదన్‌మోహన్‌రావు

కమ్మర్‌పల్లి/బాన్సువాడ/ నిజాంసాగర్/ఎల్లారెడ్డి/ డిచ్‌పల్లి, డిసెంబర్ 9: తెలంగాణ మూడో అసెంబ్లీ కొలువు దీరింది. శనివారం ఉదయం శాసనసభ సమావేశాలు ప్రారంభం కాగా.. ఉమ్మడి జిల్లాలోని ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేశారు. ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించారు. బాన్సువాడ, బాల్కొండ నుంచి బీఆర్‌ఎస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచిన పోచారం శ్రీనివాసరెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రమాణం చేశారు.

**కాంగ్రెస్ నుంచి..**

కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎల్లారెడ్డి, జుక్కల్, బోధన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు మదన్‌మోహన్‌రావు, తోట లక్ష్మీకాంతారావు, ప్రొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి, రేకులపల్లి భూపతిరెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన ఎమ్మెల్యేలకు ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో బీజేపీ నుంచి గెలిచిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి (కామారెడ్డి), పైడి రాకేశ్‌రెడ్డి (ఆర్మూర్), ధన్‌పాల్ సూర్యనారాయణగుప్తా (నిజామాబాద్ అర్బన్) అసెంబ్లీ సమావేశాలకు హాజరుకాలేదు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**CHANGE OF NAME**

★I, **NAKKA SAVITHRI W/o. NAKKA RAJESHWAR,** R/o. H.No.2-56/1, Mothe, (M) Velpur, (D) Nzb. have changed my Minor Daughter's Name From **NAKKA SRUTHIKA** to **NAKKA SRUTHIKA YADAV**

NTZ-318699

**WANTED**

★Nursing staff ANM/B.Sc. Nursing staff & ICU & Receptionist for Hospital Contact No. 87903 32690/ 9346605125

NTZ-318807

**WANTED**

★రామకృష్ణ గ్రూపు (A.P, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషంట్ల సేవకు ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గం.ల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5వేలు కమీషన్. 9281452762, 9515108830.

NT-314474

**WANTED**

స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రికన్‌స్ట్రక్షన్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న HIV ఎయిడ్స్ నివారణ కార్యక్రమము (టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ప్రాజెక్ట్) నిజామాబాద్ సైట్‌లో పనిచేయడానికి GNM ఒకరు ఫీమెల్ అర్హత (GNM పాస్) శాలరీ 16000+ T.A.1200, Note:HIV నివారణలో పనిచేసిన అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. అప్లికేషన్‌లు సమర్పించడానికి చివరి తేది: 15-12-2023 సమయం: 5.Pm వరకు.

సెల్ : 9885715897, 8639422001

**CHANGE OF NAME**

I, **MANDHULA SHIRISHA** (Old Name) D/o. Mandhula Devendhar, Age: 29 Years, Occ: House Wife, R/o. H.No.3-81, Vill: Brahmanpally, Jakranpally Mdl, Dist. Nizamabad is hereby by Declare that I Shall be called as **KOPPU SAMANTHA W/o. KOPPU NARESH** hence declared.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును

సెల్ : 91827 77590

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.